## దేశీదారు పట్టివేత

• నలుగురి అరెస్ట్



అరెస్టయిన నిందితులతో పోలీసులు

భీంపూర్, ఏప్రిల్ 14: భీంపూర్ పోలీసులు పక్కా ప్రణాళికతో మాటువేసి దేశీదారు అక్రమ రవాణాదారులను వలవేసి పట్టుకున్నారు. భీంపూర్ పీఎస్‌లో సీఐ డీ సాయినాథ్ సోమవారం వివరాలు వెల్లడించారు. అర్లి(టీ) జీపీ మందపల్లి వద్ద సీఐ, ఏఎస్ఐలు సిరాజ్, ముంతాజ్, కానిస్టేబుళ్లు మధుకర్, దినేశ్, రవీందర్, సంజయ్ సోమవారం తెల్లవారుజామున మాటువేశారు. మహారాష్ట్ర మాండ్వి నుంచి ఆత్రం లక్ష్మణ్, ఆశిష్ జైస్వాల్, కుండేకర్ ప్రభాకర్, ఆత్ర కృష్ణ దేశీదారు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 196 దేశీ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమ దేశీదారు, గంజాయి, పేకాట, మట్కా విషయాల్లో తమకు 8712659916, 8712659931 నంబర్లలో సమాచారం ఇవ్వాలని, వివరాలు రహస్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ, సిబ్బందిని డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ అజయ్

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 14 : దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరిని ఖానాపూర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం, పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు మిత్రులు మనుపటి రాజు, బొజ్జ రాజశేఖర్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడేవారన్నారు. నిందితులు తమ దొంగతనాల్లో భాగంగా ఇటీవల ఖానాపూర్ పట్టణంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద పోతులూరి అలయానికి బైక్‌పై వచ్చి బండరాయితో తాళం పగులగొట్టి వెండి, బంగారంతోపాటు నగదును అపహరించారు. అనంతరం తర్లపాడ్ గ్రామంలోని అగ్గి మల్లన్న అలయం తాళాలు పగలగొట్టి వెండి, బంగారం, నగదును ఎత్తుకెళ్లారన్నారు. చోరీలపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులిద్దరిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 50 తులాల వెండి, 4గ్రాముల బంగారం, రూ.9 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఇది వరకే పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, సిబ్బందిని సీఐ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని పులిమడుగు గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇంద్రవెల్లి అందు నాయక్ తాండ గ్రామానికి చెందిన గోతి గణేశ్ ఆటోలో కూరగాయలు లోడ్ చేసుకొని ఉట్నూర్ నుంచి ఇంద్రవెల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆ ఆటోను వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఆటో నుజ్జు నుజ్జయింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమయంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ దవాఖానకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

భైంసాటౌన్, ఏప్రిల్ 14: కడుపునొప్పి బాధ భరించలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన కల్యాణ్‌కర్ తానాజీ (31) కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక సోమవారం తన పొలంలో వేప చెట్టుకు నైలాన్ తాడుతో ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శ్రమ దోపిడీ చేస్తున్న పేపర్ మిల్లు యాజమాన్యం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 14: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ మిల్లు యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడీ చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు సీపీ రాజ్‌కుమార్, మోయిన్, అంబాల ఓదెలు, కన్నయ్య, రాగులయ్య ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పేపర్ మిల్లు గేటు వద్ద సోమవారం కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. పేపర్ మిల్లు కార్మిక చట్టాలు అమలు కాకుండా యాజమాన్యం అడ్డుకుంటోందన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలోని ఆర్ఎస్పీ నివాసంలో నిర్వహించే కార్మికుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు.


## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం బీఆర్ఎస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తాంసి, ఏప్రిల్ 14 : రాష్ట్ర ప్రభుత్వంపై గ్రామస్థాయిలో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సారధ్యంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్ అన్నారు. తాంసి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వినోద్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమణతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రజినీకాంత్ రెడ్డి, మలపతి అశోక్, ఉత్తం, కార్యకర్తలు ఉన్నారు.

## యువ వికాసానికి సర్వర్ బిజీ..బిజీ




దరఖాస్తు చేసేటప్పుడు వచ్చిన మెసేజ్

తాంసి, ఏప్రిల్ 14 : మండలంలో యువ వికాసానికి దరఖాస్తు చేస్తున్న లబ్ధిదారులకు చివరి రోజు దరఖాస్తుల సమర్పణలో ఇబ్బందులు తలెత్తాయి. మాటిమాటికి సర్వర్ బిజీ సమస్య రావడంతో దరఖాస్తు చేసుకోలేక పోయామని మండల వాసులు వాపోయారు. మూడు రోజులుగా సర్వర్ బిజీ..బిజీగా ఉండడంతో సోమవారం అర్ధ రాత్రి 12 గంటల వరకు దరఖాస్తు చేసేందుకు దరఖాస్తుదారులు ప్రయత్నించిన అదే పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. దరఖాస్తుకు నిన్నటితో గడువు పూర్తి కావడంతో మరో వారం రోజులు గడువు పెంచాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## డీటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ఎదులాపురం, ఏప్రిల్ 14 : డీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా కమిటీని కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మోతే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా టీ. సాయింకాంత్, సీహెచ్. సంతోష్, ప్రధాన కార్యగర్శిగా కే. దిలీప్, జిల్లా కార్యదర్శులుగా పీ. నగేందర్, కే. అరవింద్, ఏ. కృష్ణ, అర్క నగేశ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం. సామ్యూల్, బీ. వృకోధర్, అడిట్ కమిటీ కన్వీనర్‌గా భానోత్ ప్రకాశ్, సభ్యులుగా కృష్ణకుమార్, శుద్ధోధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఈపీ జాతీయ నూతన విద్యావిధానం అశాస్త్రీయంగా మూఢ నమ్మకాలను ప్రోత్సహించే విధంగా, దేశంలో కులవ్యవస్థను స్కిల్ యూనివర్సిటీల పేరుతో పునర్ నిర్మించే విధంగా ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే పనిలో భాగంగా బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదనే సాకుతో ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడం సరికాదని, డబ్బులు లేకపోతేత మూసీ ప్రక్షాళనకు లక్షన్నర కోట్లు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## అటవీ సంపదను సంరక్షించాలి

• ఈసీవో డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా గుగ్గిల్ల స్వామి



మాట్లాడుతున్న సిరికొండ బీట్ ఆఫీసర్ కలేందర్

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 14 : అటవీ సంపద అక్రమాలకు పాల్పడకుండా ఈసీవో డెవలప్‌మెంట్ కమిటీని సిరిచెల్మ అరేంజ్ అటవీ రిటర్నింగ్ అధికారి నాగవత్ స్వామి ఆదేశాల మేరకు కమిటీని వేస్తామని సిరికొండ బీట్ ఆఫీసర్ కలేందర్, ఎఫ్‌బీవోలు సంతోష్, హీరాలాల్ అన్నారు. సోమవారం సిరికొండలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు సమావేశ నిర్వహించారు. ఈసీవో డెవలప్‌మెంట్ కమిటీని ఎన్నుకున్నారు. ఈసీవో డెవలప్‌మెంట్ చైర్మన్‌గా గుగ్గిల్ల స్వామి, వైస్ చైర్మన్‌గా జంగుబాబుతోపాటు 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. అటవీ సహజ సంపద వన్యప్రాణులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. డెవలప్‌మెంట్ కమిటీ ద్వారా మంజూరైన నిధులు అటవీశాఖ సంపద రక్షణ పర్యావరణ వన్యప్రాణులు సంరక్షణ కృషి చేస్తూ అటవీ శాఖ ఆధ్వర్యంలో సూచించబడిన పనులు ఈ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఓరగంటి పెంటన్న, తోకల చిన, రాజన్న, ఓరగంటి శ్రీనివాస్, కోలాపురి గురుమూర్తి, మహేశ్ లతీఫ్, రాజు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఏదులాపురం, ఏప్రిల్14: అగ్నిమాపక సిబ్బంది త్యాగాలు, విజయాలు, ధైర్య సాహసాలను తెలియజేయడంలో భాగంగా వారం రోజుల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఫైర్‌మ్యాన్ జైతేం తెలిపారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు బస్టాండ్ ఎదుట అగ్నిమాపక శాఖ సిబ్బంది నీటితో విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు. అగ్ని ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తూ అండగా ఉంటున్నామని ఫైర్‌మెన్ జైత్రం అన్నారు. 1944లో విక్టోరియా డాక్‌యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వారి త్యాగాలు, అగ్నిమాపక సేవలు ప్రజలకు తెలియజేయడంలో భాగంగా ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి అగ్రిమాపక చేస్తున్న పనులను వివరిస్తామని తెలిపారు.

## నేడు భైంసాలో ప్రజా ఫిర్యాదుల విభాగం

భైంసా, ఏప్రిల్, 14 : పట్టణంలో మంగళవారం భైంసా క్యాంపు ఆఫీసులో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించనున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జిల్లా భరోసా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 నుంచి 1 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.



భీంపూర్ : పిప్పల్‌కోటిలో నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సాపూర్(జీ) నివాళులర్పిస్తున్న నాయకులు



నార్నూర్‌లో శోభాయాత్రలో మండల ప్రజలు



భైంసా : నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



ఖానాపూర్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న భుక్యా జాన్సన్ నాయక్



నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ

# ఆదర్శనీయుడు అంబేద్కర్

• జయంతి వేడుకల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు, నాయకులు

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 14 : ఆదర్శనీయుడు భారత రత్న, రాజ్యాంగ నిర్మాత, డా. బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యేలు, నాయకులు, జిల్లా అధికారులు కొనియాడారు. ఆదిలాబాద్‌లోని ఎస్సీ కార్పొరేషన్ ఆవరణలోని అంబేద్కర్ చిత్రపటం, విగ్రహానికి కలెక్టర్ రాజర్షి షా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, డీఎస్సీడీవో భగత్ సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు, దళిత సంఘాల నాయకులు, అధికారులున్నారు. ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అదనపు ఎస్పీ బీ సురేందర్రావు, డీఎస్పీ శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, తదితరులున్నారు. రిమ్స్ ఎదుట నిర్వహించిన వేడుకల్లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ముఖ్య అతిథిగా వేడుకల్లో పాల్గొన్నారు. వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు డీవైఎస్వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషన్ సీవీఎన్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

**ఆర్టికల్ 341లోనే తెలంగాణ ఏర్పాటు**
**-మాజీ మంత్రి జోగు రామన్న**

అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే తెలంగాణ సిద్ధించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ తీశారు. అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం**
**- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం సొనాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించారని గుర్తు చేశారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరును పెట్టి గౌరవించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్, సొనాల మండలాల మాజీ ప్రతినిధులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులుపాల్గొన్నారు. నేరడిగొండలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ పెంట వెంకట రమణ, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పండరి, నాయకులు పాల్గొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ క్యాంపస్‌లో అంబేద్కర్ చిత్రపటానికి ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పూలమాలల వేసి నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్ధన్, బీఆర్ఎస్ నాయకులు భరత్ చౌహాన్, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, నాయకులు పాల్గొన్నారు. ఇంద్రవెల్లిలో నిర్వహించిన వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, పెద్దపల్లి ఎంపీ వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ పాల్గొన్నారు. తాంసి, బేల, జైనథ్, భీంపూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను వివిధ సంఘాల, పార్టీల నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే పాటలతో ర్యాలీ తీశారు. అన్నదానాలు చేశారు.

**నిర్మల్ జిల్లాలో..**

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 14 : నిర్మల్ జిల్లా కేంద్రంలో ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, దళిత సంఘం నాయకులు, యువజన సంఘాల సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రజలు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. భైంసా పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకులు విలాస్ గాదేవార్, ఏఎస్పీ అవినాశ్ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

**సాటివారిని గౌరవించాలి : జాన్సన్ నాయక్**

సమాజంలో సాటి మనిషిని గౌరవించినప్పుడే అంబేద్కర్ కలలుగన్న సమసమాజ స్థాపన సాధ్యమని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ అన్నారు. ఖానాపూర్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా విశ్రాంతి భవనం వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. బాసర ట్రిపుల్ ఐటీలో అంబేద్కర్ చిత్రపటానికి వీసీ గోవర్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కడెం మండలంలోని లక్ష్మీపూర్‌లో నూతన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బొజ్జు ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులున్నారు. సారంగాపూర్, దిలావర్‌పూర్, కుభీర్, ముథోల్, కడెం, ఖానాపూర్ రూరల్, పెంబి, కుంటాల, దస్తురాబాద్, లక్ష్మణచాంద, తానూర్, నర్సాపూర్ (జీ), మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాల, పార్టీల నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులర్పించారు. పంచశీల జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజే పాటలతో ర్యాలీ తీశారు. అన్నదానాలు చేశారు.

## ఇంద్రవెల్లిలో ఆకట్టుకున్న శోభాయాత్ర



ఇంద్రవెల్లిలో శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మండల ప్రజలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్14 : మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతిలో భాగంగా అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, మండల బౌద్ధ ఉపాసకులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటంతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. మండలకేంద్రంలోని బుద్ధనగర్, భీమ్‌నగర్, మిలింద్‌నగర్, ప్రభుద్ధనగర్, సట్వాజీగూడ, మర్కాగూడ, బుర్సన్‌పటార్, కెస్లాగూడ గ్రామాలతోపాటు ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్, గోట్టి, గుండాల నుంచి వందలాదిమంది బౌద్ధ ఉపాసకులు, దళితులు అంబేద్కర్ చౌక్‌కు తరలివచ్చారు. అక్కడి నుంచి వడగాం చౌక్ మీదుగా ప్రధాన్‌గూడ వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. భీమ్ పాటలపై మహిళలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు

## పంచశీల జెండాలకు అవమానం

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 14 : పిప్పిరి గ్రామంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలోని విధుల్లో అలకరించిన జెండాలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధ రాత్రి మురికి కాలువల్లో పడేశారు. దీంతో సోమవారం ఉదయం గ్రామంలోని భీం ఆర్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులు, భీం ఆర్మీ, యువజన సంఘాల సభ్యులతో సమావేశమై మాట్లాడారు. దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామంలోని అనుమానిత యువకులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు.



పిప్పిరి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

• బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

బోథ్, ఏప్రిల్ 14 : యువకులు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సొనాలలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించారు. జెర్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయన్నారు. యువకులు క్రీడల్లో రాణిస్తే తన పరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఇర్ల అభిలాష్, సుధీర్, హరీశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను సాధించాలి

• మాజీ మంత్రి జోగు రామన్న



బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఏదులాపురం, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించాలని, ఆయన చూపిన మార్గంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంబేద్కర్ ఆశయ సాధన ఆయన స్ఫూర్తి అనే అంశాలపై పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. అంబేద్కర్ తాను చదివిన విద్య ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. అలాంటి అంబేద్కర్ స్ఫూర్తిని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. కేసీఆర్ దళితబంధు, దళితబస్తి పథకాలను అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అలాంటి మహోన్నత పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్శెట్టి గోవర్ధన్, నారాయణ, ప్రహ్లాద్, అజయ్, యూనిస్ అక్బానీ, సాజిదుద్దీన్, జగదీష్, రాజన్న, దమ్మపాల్, కొండ గణేశ్, బట్టు సతీష్ పాల్గొన్నారు.

**అయ్యప్ప మిషు పూజలో రామన్న**

తమిళ, కేరళ సంప్రదాయాన్ని అనుసరిస్తూ బెల్లూరి అయ్యప్ప ఆలయంలో సంప్రదాయ బద్ధంగా అయ్యప్ప మిషు పూజను వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని తలపై అయ్యప్ప కలశాన్ని పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దార్ల జీవన్, దాముఖ రవీందర్, అనుజుల శ్రీనివాస్, చందా గణేశ్, భూశెట్టి మహేందర్, చిలుక మహేశ్, కలమడుగుల సంతోష్ పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 14 : ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు జరుగబోయే అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను క్యారాలయంలో సోమవారం ఎస్పీ జానకీ షర్మిల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల్లో అసువులు బాసిన అగ్ని మాపక సిబ్బంది స్మారకార్థం ప్రతియేటా వారోత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు దవాఖానలు, థియేటర్లు, అన్ని ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి ప్రభాకర్, రాజలింగం సిబ్బంది అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ జావేద్ అలీ

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 14 : అగ్ని ప్రమాద నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జావేద్ అలీ అన్నారు. సోమవారం పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1944 ముంబై డాక్ యార్డులో జరిగిన ఘటనలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ ఖదీర్‌ఖాన్, డీవోపీలు పుప్పాల మహేందర్, అనిల్, ఎఫ్ఎంలు వెంకటేశ్, సాయిచరణ్, శ్రీకాంత్, హెచ్‌జీ కృష్ణ తదితరులున్నారు.

## కాంట్రాక్టు లెక్చరర్ల వినతి

బాసర, ఏప్రిల్ 14 : బాసర ఆర్జీయూ కేటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం అంబేద్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్జీయూ కేటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపడుతున్న నిరసన ఆరోరోజూ కొనసాగింది. సోమవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తమను రెగ్యులర్ చేయాలని నిరసనలో భాగంగా అంబేద్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యారంగంలో సేవలందిస్తున్న తమకు తగిన గుర్తింపు రావాలని, న్యాయం కలగాలని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే ఈ ఉపాధ్యాయులకు సరైన ప్రాధన్యం కల్పించాలన్నా ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు. ఇక్కడ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లున్నారు.

## రైతులకు సహకారమందిస్తాం

కుంటాల, ఏప్రిల్, 14 : రైతులకు తమ వంతుగా సహకారం అందిస్తామని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. సోమవారం కుంటాల రైతు వేదికలో జరిగిన భూభారతి పోర్టల్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పీఏసీఎస్ సిబ్బంది చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, మాజీ సొసైటీ చైర్మన్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మహేందర్, ఏడీఏ వీణ, డైరెక్టర్లు భూమన్న, మహిపాల్, రైతులు పాల్గొన్నారు.

## కారు బోల్తా-ఒకరి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భైంసా, ఏప్రిల్, 14 : శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నిర్మల్ మండలం లంగ్డాపూర్‌నకు చెందిన సుమన్ (34) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం, సుమన్ నిర్మల్‌లో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, భైంసాలోని నేతాజీనగర్‌లో ఓ శుభకార్యం కోసం అల్లుడు సాయిచరణ్‌తో కలిసి కారులో ఆదివారం భైంసాకు వచ్చాడు. సోమవారం పార్డీ (బీ) బైపాస్ మీదుగా నిర్మల్ వైపు తిరిగి వెళ్తుండగా మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుమన్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయాలపాలైన సాయిచరణ్‌ను అంబులెన్స్‌లో ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సుమన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారని తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ గోపినాథ్, ఎస్ఐ ఎండీ గౌసుద్దీన్ పరిశీలించారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 14 : ఖానాపూర్ పట్టణంలోని కుమ్రంభీం చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హన్మండ్లు(45) దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం రాత్రి కారు, ఆటో, బైక్ ఢీకొని ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయన్నారు. గాయపడిన క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ దవాఖానకు తరలించారన్నారు. కాగా నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న నేరడిగొండకు చెందిన హన్మండ్లు సోమవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 14: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రవీందర్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని చిర్రకుంట శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీఐ రవీందర్ పోలీస్ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారంతో రైడ్‌చేసి గ్రామ శివారులో నిల్వ ఉంచిన సుమారు వంద ట్రిప్పుల ఇసుక డంప్‌ను గుర్తించి, తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామని తెలిపారు.

## 'మున్నూరు కాపులను తక్కువ చూపడం అన్యాయం'

శ్రీరాంపూర్, ఏప్రిల్ 14 : రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వేలో మున్నూరుకాపులను తక్కువగా చూపడం అన్యాయమని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మున్నూరు కాపు సంఘాల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన దశా దిశా, గర్జన సన్నాహక సమావేశంలో తీర్మానాలను ప్రకటించారు.